క్లుప్తంగా

చెట్లతోనే పర్యావరణ సమతుల్యం

కుప్పం రూరల్: విరివిగా మొక్కలు నాటి, చెట్లయ్యే వరకు సంరక్షిస్తే పర్యావరణ సమతుల్యతకు దోహదం చేసినవారవుతారని ఉర్ల ఓబనపల్లెసర్పంచ్ అబ్బు అన్నారు. బుధవారం నాభూమి–నాదేశంకార్యక్రమంలో భాగంగా ఉర్ల ఓబనపల్లె పంచాయతీలో సర్పంచ్ మొక్కలు నాటి మాట్లాడారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా, భూగర్భ జలాలు పుష్కలంగా ఉండాలన్నా చెట్లే మూలాధారమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతి, సచివాలయ సిబ్బంది శరవణ, వినోద్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం

పలమనేరు: మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గంగవరం మండలంలోని మేలుమాయిలో బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో చైర్మన్ ఎంఆర్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కిశోర్ పాల్గొన్నారు.

మాజీ సైనికునికి సన్మానం



మాజీ సైనికోద్యోగి దంపతులను సన్మానిస్తున్న పెద్దిరెడ్డి

సదుం: దేశ రక్షణ కోసం విధులు నిర్వర్తిస్తున్న సైనికుల సేవలు వెలకట్టలేనివని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం నాభూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. మాజీ సైనిక ఉద్యోగి దంపతులను సన్మానించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, సర్పంచ్ ఉషారాణి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



వి.కోట: పేకాటరాయళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ ఆశీర్వాదం బుధవారం సాయంత్రం తెలిపారు. ఆయన కథనం..మండలంలోని కొంగాటం పంచాయతీ జేబీకొత్తూరు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.21వేలతో పాటు 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఐ, పోలీసులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించుదాం

పలమనేరు: దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీని గద్దెదించేలా ప్రజాసంఘాలు పోరాటం చేయాలని కేవీపీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ బుధవారం స్థానిక సీఐటీయూ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ నాయకులు అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ ప్రభావంతో పనిచేస్తున్న బీజేపీ సర్కారు కారణంగా దేశంలో ఎటూ చూసినా కులాలు, వర్గాలు, ప్రాంతాల మధ్య చిచ్చు రేగుతోందని ఆరోపించారు. ఈ నిరసనలో సంఘాల నాయకులు ఓబుల్‌రాజు, గిరిధర్‌గుప్త, కుమారస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన సమస్యను పరిష్కరించిన ఎంపీపీ

వి.కోట: మండలంలోని బోయచిన్నాగనపల్లె, నాయకనేరి గ్రామాలకు చెందిన యానాది కులస్తులకు శ్మశానవాటిక స్థల సమస్య ఉంది. సర్వే నంబర్ 350/5లో 30 సెంట్ల స్థలాన్ని శ్మశానానికి కేటాయించారు. అయితే ఆ స్థలం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో తమకు అనుకూలంగా ఏర్పాటు చేయాలని ఎంపీపీని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీపీ యువరాజు ఆ స్థలానికి మట్టి తోలించి, ఇబ్బంది లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు.

జాబ్ చార్ట్ ప్రకారం విధుల నిర్వహణ



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ రవికుమార్

రొంపిచెర్ల: గ్రామ సచివాలయ సిబ్బంది జాబ్ చార్ట్ విధులను సక్రమంగా నిర్వర్తించాలని డీఎల్‌డీఓ రవికుమార్ అన్నారు. అయన బుధవారం మండలంలోని చిచ్చిలివారిపల్లె, పెద్దమల్లెల, రొంపిచెర్ల గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అయన మాట్లాడారు. అర్హులకు ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందించాలని, వివిధ రకాల ధ్రువపత్రాలను సకాలంలో మంజూరు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర, కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు, శివగణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కావడి మొక్కులతో హరో హర..



సోమలలో కావళ్లతో వస్తున్న భక్తజనం



గుడుపల్లె : గుడివంక కొండపైకి వెళ్తున్న భక్తులు

గుడుపల్లె: మండలంలో గుడివంకలోని ప్రముఖ శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కొండకు భక్తులు పోటెత్తారు. ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తజనంతో గుడివంక ఆలయం కిటకిటలాడింది. భక్తులు పశ్చిమ వాహినిలో స్నానాలు ఆచరించి, కొండపైకి చేరుకుని మొక్కులు చెల్లించారు. గంగపూజలు చేశారు.

కుప్పం: వేల్ మురుగనికే హరో హరా..అంటూ భక్తుల నామస్మరణతో స్థానిక నేతాజీ రోడ్డుని సుబ్రమణ్య స్వామి దేవాలయం మార్మోగింది. ఆడికృత్తిక సందర్భంగా బుధవారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, వివిధ రకాలు పుష్పాలతో అలంకరించారు. ఆడి మాసం ప్రారంభం నుంచి దీక్షలతో ఉన్న భక్తులు కావళ్లతో వచ్చి, స్వామి దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కుప్పం నుంచి గుడివంక వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడంలో భక్తులతో ఆర్టీసీ బస్టాండు కిక్కిరిసింది.

రామకుప్పం మండలంలో..

రామకుప్పం: మండలంలోని పాలరేవుగడ్డ బాల మురుగన్, రామకుప్పం శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో స్వామి అమ్మవారికి ఉదయాన్నే ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు చేశారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. కావడి మొక్కులు చెల్లించేందుకు వచ్చిన భక్తుల హరో హర నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తిప్రపత్తులతో కృత్తిక కావడి మొక్కులు చెల్లింపు

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలోని శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాలు భక్తుల హరో...హరా నామస్మరణతో మార్మోగింది. బుధవారం ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శ్రీవళ్లీ దేవసేన సమేత శ్రీషణ్ముఖ సుబ్రమణ్యస్వామికి ప్రధాన అర్చకులు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్ స్వామి అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు. ఆలయాన్ని ప్రత్యేకంగా రంగు రంగుల పూలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు కృత్తిక కావడి మొక్కులు చెల్లించారు. మరి కొందరు నాలుకపై అటు నుంచి ఇటు వైపు చిన్న పాటి శూలాలు గుచ్చుకొని తమ మొక్కులు తీర్చారు. అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం రాత్రి సుబ్రహ్మణ్యస్వామిను నెమలి వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి బెల్లాల శ్రీనివాసుల కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు.

వేడుకగా ఆడికృత్తిక

సదుం: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారం చేశారు. పలువురు భక్తులు తల నీలాలు సమర్పించి, పుష్పకావిళ్లతో మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవం వేద పండితులు కనుల పండువగా నిర్వహించారు.

స్వామివారి సేవలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే

స్వామి వారిని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. వారికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించారు.

పుష్ప కావళ్ల చెల్లింపు

సోమల: ఆడికృత్తిక సందర్భంగా మండల కేంద్ర సమీపంలోని బంగారు తిరుత్తణి కొండపై ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి బుధవారం పలువురు భక్తులు పుష్ప కావళ్లు సమర్పించారు. మొక్కులు చెల్లించారు.

కావళ్ల భక్తులతో కిటకిట

–స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, నేతలు

పలమనేరు: ఆడికృత్తిక సందర్భంగా పట్టణ సమీపంలోని టీఎస్ అగ్రహారం సుబ్రమణ్యస్వామి ఆలయం బుధవారం కావడి మొక్కుల భక్తులతో కిటకిటలాడింది. హరో హర నామస్మరణతో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అలాగే కొండపై కొలువున్న సుబ్రమణ్యస్వామి ప్రధాన ఆలయం కిక్కిరిసింది. కిందనున్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు విశ్వనాథరెడ్డి, చెంగారెడ్డి, ప్రహ్లాద, కౌన్సిలర్లు రాజేష్, కోదండరామయ్య, నాగరాజు, రవి తదితరులు హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు సుబ్రమణ్యం రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, ప్రసాద్‌రెడ్డి అర్చకులతో కలిసి ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు పుష్కలంగా కురిసి, పంటలు సమృద్ధి పండాలని కోరుకున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే, పట్టణంలోని శివాలయం, మొరం అజనాద్రి, కూర్మాయి గ్రామాల్లోనూ ఆడికృత్తిక పూజలు ఘనంగా చేశారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

పలమనేరు: పట్టణంలోని శివాలయ అనుబంధ సుబ్రమణ్యస్వామి ఆలయంలో శ్రీవల్లీ దేవయాని సమేత సుబ్రమణ్యస్వామికి బుధవారం రాత్రి కనుల పండువగా భక్తజన సందోహం నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. కంకణధారణ, కన్యాదానం, వస్త్ర సమర్పణ, మాంగల్య పూజ, తలంబ్రాల సమర్పణ మొదలైన వాటిని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ వీరభద్ర, దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వి.కోట : ఆల్వారిపల్లె క్రాస్‌లో విశేష అలంకరణలో స్వామి అమ్మవార్లు



పలమనేరు : కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణం..కమనీయం

పెద్దపంజాణి: ఆడికృత్తికను పురస్కరించుకుని మండలంలోని కోగిలేరు జలకంఠేశ్వరాలయం సమీపంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మూలవిరాట్‌లకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. విశేష అలంకరణల అనంతరం కళ్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్లుపల్లెకు చెందిన చిన్నా దంపతులు భక్తులకు వాటర్ బాటిళ్లను అందజేశారు. ఆలయ చైర్మన్ వెంకటరెడ్డి, గౌతమ్ రెడ్డి, కిట్టప్ప, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వి.కోట మండలంలో..

వి.కోట: కృత్తికను పురస్కరించుకుని బుధవారం మండలంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కావడి మొక్కులు చెల్లించారు. ఆల్వారిపల్లె క్రాస్‌వద్ద కొండపై ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయం, బీసీపల్లె పంచాయతీలోని సీవీఆర్ కొండపై సుబ్రమణ్య స్వామి దేవాలయాలకు భక్తులు వేలాదిగా వచ్చారు.



సదుం: స్వామి వారిని దర్శించుకుంటున్న తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



పలమనేరు : స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



పలమనేరు : మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



గుడుపల్లె : తేరుకావళ్లతో వస్తున్న భక్తులు



రామకుప్పం : పాలరేవుగడ్డలో..

పట్టువస్త్రాలు సమర్పణ



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని 102 ఇ.రామిరెడ్డిగారిపల్లెలో నిర్వహిస్తున్న ఆడికృత్తిక ఉత్సవాల్లో బుధవారం సుబ్రమణ్యస్వామికి ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామి వారికి భక్తజన సందోహం నడుమ అర్చకులు కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బాలకృష్ణమరాజు, ప్రసాద్, గంగిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సరస్వతి, దేవేంద్ర, పద్మావతి, రెడ్డెప్పరెడ్డి, ప్రభావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ ఫలాలు

–'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో అర్హత కలిగిన ప్రతి ఇంటికీ పథకాల ఫలాలు అందుతున్నాయని వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ అన్నారు. బుధవారం మండలంలోని దాసిమానిపల్లె గ్రామ పంచాయతీ అత్తినత్తంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామంలోని 96 ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాల వారితో మాట్లాడారు. వారు పొందిన వివిధ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. ప్రతి సచివాలయానికి మంజూరయ్యే రూ.20లక్షలతో వాటి పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ క్రిష్ణమూర్తి, సర్పంచులు దేవరాజు, రామమూర్తి, యూత్ రవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్

సంక్షేమం వివరించి..సమస్యలను పరిష్కరించి..!

- మొత్తం 17,465 కుటుంబాలను కలిసిన ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: మండలంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం ముగిసింది. ఎమ్మెల్యే వెంకటేగౌడ మొత్తం 19 గ్రామ సచివాలయాల పరిధిలో పర్యటించారు. 17,465 వేల గృహాలను సందర్శించారు. గ్రామాల్లో తన దృష్టికి ప్రజలు నివేదించిన దీర్ఘకాలిక సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఒక్కో సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు పూనుకున్నారు. చివరిరోజైన బుధవారం మండలంలోని బండకుంట, కుంబార్లపల్లె, చామనేరు, గోనుమాకులపల్లె, ముదరంపల్లె, చామనేరు కొత్తూరులో ఎమ్మెల్యే పర్యటించారు. 518 గృహాలకు వెళ్లి ఆయా ఇళ్లలోని వారిని పలకరించారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలు పొందిన వివిధ పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. ఆయన మాట్లాడుతూ, పార్టీలు, కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఒరవడి సృష్టించారన్నారు. ప్రతి కుటుంబం పథకాల లబ్ధి పొందాలనే దిశగా తన పర్యటన ముగించానన్నారు. ఏ గడపకు వెళ్లినా సీఎంగా జగనే మళ్లీ రావాలని అందరూ దీవిస్తుంటే ఆనందంగా ఉందని, రానున్న ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి, పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, ఎంపీడీఓ భాస్కర్, ఏఎంసీ డైరెక్టర్లు ఎర్రబల్లి శ్రీనివాసులు, సురేష్, స్థానిక సర్పంచ్ మంగమ్మ, ఎన్‌హెచ్ఆర్‌సీ (ఆర్‌టీఐ) ఏపీ ప్రెసిడెంటు ఆంజప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, మాకయ్య, నాయకులు రాజా రెడ్డి, శంకర్ రెడ్డి, నాగ శంకర్ రెడ్డి, కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



రామకుప్పం : రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి

వి.కోట/రామకుప్పం: మామిడి పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం వి.కోట మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ, రామకుప్పం మండలం కెంపసముద్రంలో మామిడి తోటల పెంపకం, కోత అనంతరం తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, మామిడి తోటల్లో కోతల అనంతరం చెట్ల కొమ్మలను కత్తిరించాలన్నారు. లీటర్ నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడి తోటల్లో జనుము, జీలుగ, పిల్లిపెసర, పచ్చిరొట్టనిచ్చే పంటలను పెంచి కలియదున్నాలన్నారు. అలాగే కుదవగడ్డ గ్రామంలో సీవీ ఆనంద్‌రెడ్డి మామిడి తోటను అధికారులు పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయ సంచాలకులు కోటేశ్వర్‌రావు, శాస్త్రవేత్త రెడ్డిరాం, మండల ఉద్యానశాఖాధికారిణులు లక్ష్మీప్రసన్న, డింపుప్రియ, రామకుప్పం మండల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, బందార్లపల్లె సర్పంచ్ రాజ్‌గోపాల్, మాజీ సర్పంచ్ సీతాపతి, రైతులు పాల్గొన్నారు.

'అభివృద్ధికే సాంకేతికతను వినియోగించాలి'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భువనేశ్వరి

వి.కోట: సాంకేతికతను వినాశనానికి ఉపయోగిస్తే అపార నష్టం వాటిల్లుతుందని ఏపీ సాంకేతిక మండలి జిల్లా సమన్వయకర్త భువనేశ్వరి అన్నారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 1945 ఆగస్టు 6, 9వ తేదీల్లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుబాంబు దాడులు జరిగి 78 ఏళ్లు అయిన సందర్భంగా బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆమె మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక రంగాలు పురోగమిస్తున్న తరుణంలో విజ్ఞానాన్ని అభివృద్ధి, మంచి వాటికే ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గుడుపల్లె ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు బాలాజి, మొబీనా, బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యాధికారి

బైరెడ్డిపల్లె: గర్భవతులు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారని వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. స్థానిక పీహెచ్‌సీ కేంద్రం వద్ద బుధవారం మహతి ఫౌండేషన్ సహకారంతో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేసి వైద్యాధికారి మాట్లాడారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేసుకోవాలని, ప్రభుత్వాసుపత్రిల్లోనే కాన్పులు చేసుకోవాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం పండ్లు, పాలు, గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు బుజ్జి, శాంతమ్మ, శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్యసిబ్బంది, గర్భవతులు పాల్గొన్నారు.

12,13న గడప గడపకు..

పలమనేరు: మండలంలోని బయ్యప్పగారిపల్లె పంచాయతీలో ఈ నెల 12,13వ తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ నిర్వహిస్తారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ అనుబంధ విభాగాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నామినేషన్ల దాఖలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీలోని పదవ వార్డుకు సంబంధించి బుధవారం ఒక నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ ఆఫీసర్ సిద్ధరామయ్య తెలిపారు. ఈ వార్డు సభ్యునికి వీఆర్‌ఏ పోస్టు రావడంతో అతను రాజీనామా చేశాడు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎస్సీ మహిళ రిజర్వేషన్ స్థానానికి డి.కృష్ణకుమారి నామినేషన్ వేశారు.

శాంతిపురంలో..

శాంతిపురం: మండలంలోని కడపల్లె, మఠం, దండికుప్పం పంచాయతీలలో ఉప ఎన్నికలు జరగనున్న 3 వార్డులకు బుధవారం 4 నామినేషన్లు దాఖలయ్యాయి. మఠం పంచాయతీలోని 10వ వార్డుకు పాన్నేపల్లెకు చెందిన రమణప్ప, దండికుప్పం 3వ వార్డుకు చంద్రమ్మ, కడపల్లె పంచాయతీ 10వ వార్డుకు బీఎం గొల్లపల్లెకు చెందిన నాగమ్మ, గజేంద్ర మండల సచివాలయంలో ఎంపీడీఓ హేమమాలినికి నామినేషన్ పత్రాలను అందజేశారు.

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు పంచాయతీ 6వ వార్డు ఉప ఎన్నికలకు బుధవారం ఒక నామినేషన్ దాఖలు అయినట్లు ఎన్నికల అధికారి రమేష్ తెలిపారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న కృష్ణకుమారి

పుదిపట్లలో..

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల పంచాయతీ 4వ వార్డు మెంబరు ఎన్నిక కోసం బుధవారం మిట్టూరుకు చెందిన వి.నరసింహులు నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి కేశవరెడ్డి తెలిపారు.

కందూరులో..

సోమల: మండలంలోని కందూరు పంచాయతీ 4వ వార్డు సభ్యుడి స్థానానికి బుధవారం ఒక నామినేషన్ దాఖలైందని స్టేజ్–1 ఎన్నికల అధికారి అనూష తెలిపారు. 4వ వార్డు సభ్యుడు రాంకుమార్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో కందూరుకు చెందిన మంజునాథ నామినేషన్ దాఖలు చేశారు.

దేశభక్తితో ముందుకు..



పులిచెర్ల (కల్లూరు)! గడ్డంవారిపల్లెలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పులిచెర్ల(కల్లూరు): ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ముందుకుపోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రెడ్డీశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని గడ్డంవారిపల్లె, మంగళంపేట, రేణుమాకులపల్లెలో 'మన మట్టి, మనదేశం, మనభూమి వందనం' కార్యక్రమం నిర్వహించారు. మనమందరం మాతృభూమి కోసం జీవించడమే స్వాతంత్య్ర సమరయోధులకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ముర్వత్ బాషా, నాగరాజ ప్రసాద్ , రాజేష్, రమణారెడ్డి, ప్రసాద్, మధు, ఏపీడీ శ్రీనివాసులు, ఏపీఓ షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని ఆమినిగుంట, పందిళ్లపల్లె, దుర్గసముద్రం గ్రామపంచాయతీలో నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ సుధాకర్ ఆధ్వర్యంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, కూలీలతో కలిసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులు అర్పించారు. వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, సర్పంచులు సావిత్రి, కదిరప్ప, సరస్వతమ్మ ఏపీఓ శ్రీనివాసులు, జేఈ ధనుంజయుడు, టీఏ అమరనాథ్, బాషా తదితరులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: దేశ భక్తిని పెంపొందించడానికే నా మట్టి–నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. స్థానిక సచివాలయం నుంచి సర్పంచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఎస్ఆర్ఈజీఎస్ కార్యాలయం వరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి మాజీ సీనియర్ సైనికులు అంకెం సుబ్బురాయప్ప, సీజీ రెడ్డెప్ప, పీఎస్ సీతారామయ్యలను ఘనంగా సన్మానించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, ఎంపీడీఓ నాగరాజ, ఈఓపీఆర్డీ సుధాకర్, ఆర్ఐ సుబుక్షల్లా, మాజీ సర్పంచ్ శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ రమణయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు వీవీ రమణ, అడుసుపల్లె సురేంద్ర పాల్గొన్నారు.

రొంపిచెర్ల మండలంలో..

రొంపిచెర్ల: నాభూమి–నాదేశం, నేల తల్లికి సమస్కారం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గానుగచింత, మోటుమల్లెల గ్రామ పంచాయతీలలో శిలా ఫలకాలను జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన వారిని స్మరించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర, సర్పంచులు హేమలత, జీవలత, ఎంపీటీసీలు రమణమ్మ, విజయశేఖర్, ఏపీఓ బాలమురళి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాభూమి–నాదేశం ర్యాలీ



పలమనేరు : ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పలమనేరు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'నాభూమి–నాదేశం, నేల తల్లికి సమస్కారం– వీరులకు వందనం' అనే నినాదంతో బుధవారం మున్సిపల్ సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహించినట్టు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.